క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహం మాయం



ఖాళీగా ఉన్న విగ్రహం ఏర్పాటు చేసిన చోటు

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంగిరెడ్డిపల్లి ప్రధాన రహదారి తోకగుట్ట ఇండ్లు సమీపంలో ఎన్నో ఏళ్ల కిందట దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు కూడా విగ్రహం అక్కడే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. జనసమర్థంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలకు రాజీనామా చేయండి



మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు

తిరుపతి(అలిపిరి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు పొందిన వారంతా స్వచ్ఛందంగా తమ ఉద్యోగాలకు రాజీనామా చేయాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు డిమాండు చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు యువత ఎన్నడూ దాడులకు పాల్పడదని.. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగించే పనులు చేపట్టరని.. యూనివర్సిటీ వీసీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో సమస్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసుదేవ్, కరణం సంతోష్, గణేష్, సునీల్, శ్రీరామ్, సందీప్, రవి పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీశనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివుని రుద్రాభిషేకం



విశేష అలంకరణలో మహాశివుడు

పుత్తూరు: వడమాలపేటలోని భవానీ శంకర స్వామికి శనివారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా వేకువ జామున గణపతి పూజ, గోపూజ, స్వస్తి వాచన, ఏకాదశ రుద్ర కలశస్థాపన నిర్వహించారు. మహాశివుడి మహాలింగానికి వేదమంత్రాల నడుమ పంచామృత అభిషేకం చేశారు. అనంతరం రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల మధ్య మహారుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శివ పార్వతుల ఉత్సవమూర్తులకు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వర్షం వచ్చేరో.. ఏరువాక సాగేరో..

- పొలాల్లో రైతన్నలు
- భూములు దుక్కులు చేస్తున్న వైనం
- వ్యవసాయ పనుల్లో బిజీబిజీ



విత్తుకు సిద్ధం చేసిన పొలం



కూరగాయల సాగుకు సాలు తోలుతున్న రైతు

భాకరాపేట : నైరుతి రుతుపవనాల రాకతో మే నెలలో రైతులు విత్తనాలు విత్తుకునేందుకు పెద్దఎత్తున సిద్ధమయ్యారు. జూన్ మొదటి వారంలో రుతుపవనాలతో కొద్దిపాటి చిరుజల్లులు అక్కడక్కడ పడ్డాయి. దీంతో రైతులు కొంతమేర వేరుశనగ సాగు చేశారు. అయితే గత పది రోజులుగా చిరుజల్లులు కురుస్తుండడంతో అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివెరుస్తోంది. వరుణుడు ఆలస్యంగా నైనా కరుణించడంతో వ్యవసాయ పనులు చేయడానికి అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. వరుసగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం నిపుణులు చెబుతుండడంతో పొలాల్లో దుక్కులు చేయడం, విత్తనాలు విత్తుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రారంభంలో విత్తుకున్న రైతులకు ఈ వర్షం కొంత ఊరట కలిగించింది. జిల్లా అంతటా వర్షాలు పడుతుండడంతో వర్ష సూచనలు వచ్చినట్లేనని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే విత్తనం వేయడానికి ఇంకా గడువు ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నా, అదును దాటుతుందేమో అన్న ఆందోళనతో రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నారు. జులై నెలాఖరులోగా 80 శాతం వరకు సాగుకు సంబంధించి విత్తుకోవడం పూర్తవుతుంది. కానీ జిల్లాలో శనివారం, ఆదివారం నాటికి 60 మిల్లీమీటర్లు వర్షం నమోదైతేనే విత్తుకోవాలని అప్పుడే విత్తనం మొలకెత్తేందుకు వీలుగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల పంటలు 2.98 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం వేరుశనగ 47 వేల హెక్టార్లు, టమాట 6 వేల హెక్టార్లు, ఇతర కూరగాయల పంటలు 2 వేల హెక్టార్లలో మాత్రమే సాగుచేయడానికి సిద్ధం చేసినట్లు సమాచారం.

విరివిగా వర్షాలు..

రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న చినుకులతో రైతులకు ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. శని, ఆదివారాల్లో ఆకాశం పూర్తిగా మేఘాలతో నిండిపోయింది. గతేడాది ఈపాటికే 65 శాతం సేద్యం పనులు చేపట్టినా ఇప్పుడు 25 శాతం కూడా పూర్తి కాలేదని అధికార లెక్కలు చెబుతున్నాయి. ఆలస్యంగా అయినా వర్షాలు కురవడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో బోసిపోయిన ఎరువులు, విత్తన దుకాణాలు వద్ద రైతుల తాకిడి కనిపించింది.

వైభవంగా దేవరకొండపై పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు వైభవంగా సాగాయి. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలువురు భక్తులు ఉపవాస దీక్షలును ముగించుకున్నారు. కొండపై చెక్కభజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవులతో భక్తులు సందడి మొదలైంది.

పోలీస్ కాంప్లెక్స్‌లో ఎస్పీ తనిఖీలు



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: తిరుమల పోలీస్ కాంప్లెక్స్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి భక్తులతో మర్యాద పూర్వకంగా హుందాగా వ్యవహరించాలని, పోలీస్ ప్రఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచాలని మన లక్ష్యం అన్నారు. అలిసిపోయి సేద తీరుతున్న భక్తుల వద్ద నుంచి చిన్న పిల్లలను, విలువైన ఆభరణాలను, మొబైల్ ఫోన్లను దొంగలించే వారిపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతను కల్పించాలన్నారు. స్థానిక బాలాజీ నగర్ పరిసరాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు వివరాలను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకుని వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకట్రావు, శివరామిరెడ్డి, డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



ప్రభుత్వ హాస్టల్లో ఐఆర్‌ఎస్ మందును పిచికారీ చేస్తున్న అధికారులు

చంద్రగిరి: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో దోమల నివారణపై ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్లు కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కుసుమ కుమారి అన్నారు. శనివారం మండల పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లలో ఇండోర్ రెసిడువల్ స్ప్రేయింగ్(ఐఆర్‌ఎస్) పిచికారీ చేసి దోమల నివారణ కోసం చర్యలు తీసుకున్నారు. ఐఆర్‌ఎస్ పిచికారీ చేయడం ద్వారా దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడవాపు జ్వరాలు రాకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. యూనిట్ అధికారి శివయ్య, మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారి ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ వాసుదేవ, హాస్టల సిబ్బంది, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిని అభివృద్ధి చేస్తాం

తిరుపతి (అలిపిరి): తిరుపతిని అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తిరుపతిలో అభివృద్ధి మాటున జరిగిన అవినీతిపై విచారణ చేయిస్తామని కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రఫీ హిందుస్తానీ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా చంద్రబాబు నడుచుకుంటారని, ఆయన పాలనలో ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాల్ మధు, సలీం, చిన్న రాయల్, విజయ లక్ష్మి, పివి లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారి దర్శించుకున్న క్రికెట్ ప్లేయర్ మయాంక్ అగర్వాల్, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం ఐపీఎల్ హైదరాబాద్ క్రికెట్ ప్లేయర్ మయాంక్ అగర్వాల్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కేబుల్ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదరించాలి



రామోజీరావుకు నివాళులు అర్పిస్తున్న కేబుల్ ఆపరేటర్లు

తిరుపతి(అలిపిరి): కేబుల్ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదరించాలని.. వీధిన పడకముందే ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక పథకాలతో తమను ఆదుకోవాలని ఏపీ కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియాల శ్రీరామ్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేబుల్ ఆపరేటర్లను అసంఘటిత కార్మికులుగా గుర్తించి ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు మాట్లాడుతూ సమాజంలో జరిగే సంఘటనలు ఇంటింటికీ కష్టపడి అందిస్తున్నామని.. తాము సైతం మీడియాలో ఓ భాగమన్నారు. విధుల్లో పలువురు కేబుల్ ఆపరేటర్లు ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నారని.. అలాంటి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఏపీ ఫైబర్ కనెక్షన్లను ఆపరేటర్లకు అందించాలని విన్నవించారు. అనంతరం ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో కేబుల్ ఆపరేటర్లు బసవయ్య, జగదీష్, బుల్లెట్ బాబు, ప్రకాష్, రమణ, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, ఆనంద్, లోకేష్ పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య దీక్ష



భర్త ఇంటి ముందు దీక్షకు దిగిన ధరణి

పాకాల: తన భర్త ఇంటిలోకి రానివ్వడం లేదంటూ ఓ వివాహిత భర్త ఇంటి ముందు దీక్షకు దిగిన సంఘటన మండలంలోని చెన్నుగారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం తవనంపల్లి మండలం ఎగువమత్యం గ్రామానికి చెందిన బాధితురాలు ఎం.ధరణి తెలిపిన వివరాల మేరకు.. ఏడాదిన్నర క్రితం చెన్నుగారిపల్లికి చెందిన రాజ్ కుమార్‌తో తనకు పెద్దల సమక్షంలో వివాహం జరిగిందని చెప్పింది. కొంతకాలం ఇద్దరూ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ కాపురం సాగిందని తెలిపింది. ఇటీవల తమ మధ్య మనస్పర్థల వచ్చాయని, దీంతో తన భర్త తనను ఇంట్లోకి రానివ్వడం లేదని వాపోయింది. తన భర్త తనకు కావాలంటూ తల్లితో కలిసి దీక్షకు దిగింది.

'ఆరణి'కి మంత్రి వర్గంలో చోటు కల్పించాలి



మాట్లాడుతున్న బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్

తిరుపతి(అలిపిరి): తిరుపతి అభివృద్ధికి ఆరణి శ్రీనివాసులు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నారని.. బలిజల్లోని పేదల అభివృద్ధికి అధిష్టానం గుర్తించి మంత్రి వర్గంలో ఆయనకు చోటు కల్పించాలని బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ అన్నారు. బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బలిజ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, నాయకులు ప్రసాద్, గుంటూరు గోపీనాథ్, భాస్కర్, నీలాద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా



చంద్రశేఖర్‌రెడ్డి

రామచంద్రాపురం: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవికి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన రాజీనామా పత్రాన్ని తిరుపతి డివిజనల్ కోఆపరేటివ్ అధికారి లక్ష్మీకి పంపించారు. తన రాజీనామా లేఖను ఆమోదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైనందుకు నైతికంగా బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. తన హయాంలో రూ.1.50 కోట్ల బంగారు రుణాలు, లాకరు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. తనకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు, రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రచయిత కలవగుంటకు సంతాపం

తిరుపతి (అలిపిరి): ప్రముఖ రచయిత బావుక బ్రహ్మ కలవగుంట రామ్మూర్తి రెండు రోజుల క్రితం గుండె పోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కవలగుంట మృతి పట్ల తిరుపతి జిల్లా రచయిత సంఘం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలోని చాంబర్స్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన సంతాప సభలో పలువురు సాహితీవేత్తలు, స్మరించుకుని నివాళి అర్పించారు.

రామోజీరావుకు నివాళి..

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు ఆకస్మిక మరణం అందరినీ దుఃఖసంద్రంలోకి నెట్టివేసిందని పలువురు మేధావులు అన్నారు. సభలో సంచాలకులు భూమన్, మధురాంతకం నరేంద్ర, రాసాని శేషశైలేంద్ర, తిరుపతి జిల్లా రచయిత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగారాజు, మన్నవ గంగాధర ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు యువశ్రీ మురళి, రచయితలు ఆర్‌సీ రాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, శ్రీమన్నారాయణ, మల్లేశ్వరరావు, కాంతారావు, సుభద్ర, నడ్డి నారాయణ, చెన్నకేశవులు నాయుడు, చింత గోవిందయ్య పాల్గొన్నారు.

ముకుందా..ముకుందా..!



భరతనాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో రెండో శనివారం కావడంతో సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన నటరాజ్ డ్యాన్స్ శనివడారం ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరత నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా వినాయక స్తోత్రం, భరత వేదమున, గురు బ్రహ్మ, నీలినీలి కళ్ల వాడే, అదివో అల్లదివో, వేయి నామాల వాడ, ముకుందా ముకుందా, హర హర శంకర వంటి పాటలకు కళాకారులు లాలస్ రాజ్, హేమశ్రీ, దీపిక, వార్షిక, రేషిక, శ్రీభవ్య, సాజేష్, అక్షయ, హర్షిణి, సాత్విక, యజ్ఞశ్రీ, పర్ణశ్రీ, దాన్విక, వేదాంక్షి, వర్షుకల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం

యాదమరి(బంగారుపాళ్యం): యాదమరి మండలం చెన్నారెడ్డి పల్లెలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో వెలసిన ద్రౌపతి ధర్మరాజులకు శనివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం వద్ద కొలువు దీర్చనున్నట్లు వివరించారు. అర్చక వేదపండితులచే మహాభారత యజ్ఞంకు ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల 26వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం ఆయలం వద్ద మదనపల్లెకు చెందిన గానకోకిల హరికథ విశారద టీటీడీ ఆర్టిస్ట్ హేమావతిచే హరికథ కాలక్షేపం నిర్వహిస్తున్నటు వివరించారు. రాత్రి నాటకాలు ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్ల తెలిపారు.

కడప, కర్నూలు విజయదుందుభి

తిరుపతి రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మలగుంటలోని కేవీఎస్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ సీనియర్స్ టీ20 క్రికెట్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. చిత్తూరు, కడప, కర్నూలు, అనంతరపురం, నెల్లూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులతో సౌత్ జోన్ సీనియర్ టీ20 టీమ్‌ను ఎంపిక చేయనున్నారు. ఈనెల 11వ తేదీ వరకు ఈ జిల్లాల మధ్య పోటీలు జరుగుతాయి. టోర్నమెంట్‌లో భాగంగా శనివారం ఉదయం అనంతపురం, కడప జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 18 ఓవర్లలో ఏడు వికెట్లకు 138 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 17.5 ఓవర్లలోనే ఏడు వికెట్లు కోల్పోయి 141 పరుగులు సాధించింది. మధ్యాహ్నం చిత్తూరు-కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 169 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 163 పరుగులకే పరిమితమైంది.

రామోజీరావు మరణం తీరని లోటు

వెంకటగిరి(సైదాపురం): ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం తీరని లోటని వైఎస్ఆర్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రామోజీరావు మృతిపై ఆయన శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన తెలుగు భాషకు ఎంతో ప్రాముఖ్యత తెచ్చారని కొనియాడారు.

తిరుచ్చిపై శ్రీనివాసుని కటాక్షం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

నేత్రపర్వం.. కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ



ఊంజలసేవలో ఉభయ నాంచారులతో స్వామివారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులు ఊయ్యాల సేవలో భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్టింపజేసి ఊరేగింపుగా ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. అనంతరం వేద నాద కచేరీల నడుమ స్వామి,అమ్మవార్లు ఊయలలో సేదతీరుతూ భక్తులను దర్శనమిచ్చారు.